


# పరదేశీ కథలు

## - చిట్టే సిద్ధ లలిత



- 107 -

## అమన్ చెప్పిన అబద్ధం

కత్తికి బాగా పదును పెట్టింది సీమ. ఆమె హృదయం కోపంతో భగ్గుమంటోంది. పదేళ్ళ వివాహ బంధం. పర్యవసానంగా ఆరేళ్ళ కొడుకు. పిల్లాడి ముద్దు మాటలు విని మురిసిపోవాల్సిన సమయంలో వీడికి మరో పెళ్ళి కావాల్సి వచ్చిందా? అక్కడ జోర్డాన్ లో అత్త కూతురితో శోభనం కూడా చేసుకుని తిరిగి కువైట్ కు వస్తున్నాడట. ఎంత ధైర్యం. ఇంటికి రానీ చెప్తాను. వాడి అంతు చూస్తాను అనుకుంటూ కత్తి నూరుతోంది సీమ.

ఆరేళ్ళ పిల్లాడు అమన్ అమ్మను భయంగా చూస్తున్నాడు. తెలిసీ తెలియని వయసు. నాన్న ఏదో తప్పు చేసాడని, అందుకే అమ్మ కోపంగా వుందని అర్థమవుతోంది.

నెల ముందు నాన్న జోర్డాన్ వెళ్ళినప్పటినుండీ అమ్మ ఏడుస్తూనే వుంది. తనలో తాను మాట్లాడుకుంటూ ఫోన్ లో నాన్నను అరుస్తోంది. అమ్మ కోపం చూస్తే భయమేస్తోంది.

బిక్కుమంటూ సోఫాలో మూల కూర్చున్నాడు అమన్. కొడుకును చూసి జాలి కలిగింది. పిల్లాడి చేతికి చిప్స్ పేకెట్ ఇచ్చి తినమంది.

కత్తి చేత పట్టుకుని ఫ్లయిట్ దిగి ఇంటికి వచ్చే రెహ్మాన్ కోసం ఎదురు చూస్తోంది సీమా. ఏది ఏమైనా అతడిని వదిలేది లేదు అని నిర్ణయించుకుందామె. ఆ సమయంలో ఆమె కాళికలా కోపంతో ఊగిపోతోంది.

పదేళ్ళముందు తన వెంటపడి మాయ మాటలు చెప్పి ఇప్పుడు నీది పరాయి దేశం, నిన్ను మా వాళ్ళు కోడలిగా అంగీకరించరు కాబట్టి మా అమ్మానాన్న చెప్పినట్లు మా దేశపు పిల్లను చేసుకుంటున్నాను అని ఫోన్ చేసి చెప్పాడు. ఆ మాట చెప్పకపోయినా బావుండేదేమో. అప్పటినుండీ రగిలిపోతోంది ఆమె హృదయం.

అతడికి అది మామూలు విషయమే కావచ్చు. ఇస్లాం సంప్రదాయం అతడిది. ఇలా తలాక్ ఇచ్చి అలా నిఖా చేసుకోగలరు వాళ్ళు. కానీ మనస్ఫూర్తిగా ప్రేమించి అతడే సర్వస్వం అనుకున్న సీమ ఈ విషయాన్ని

జీర్ణించుకోలేకపోతోంది.

✻✻✻

సమయం భారంగా గడుస్తోంది. రెహ్మాన్ ఫ్లైట్ ల్యాండ్ అయినట్లు తెలుస్తోంది. ఇక ఏ నిముషంలోనైనా అతడు ఇంటికి వచ్చేస్తాడు. అందుకే అమన్ ను నిద్రపుచ్చింది.

ఇంతలో డోర్ బెల్ శబ్దం వినిపించింది.

✻✻✻

సీమ గుండె వణికింది. కంట్లో నీరు ఉబికింది. అయినాసరే కత్తిని గట్టిగా బిగించి పట్టుకుంది. తలుపు తీస్తూనే అతడిపై దాడి చెయ్యాలని నిశ్చయించుకుంది. అతడిని సంసార సుఖానికి పనికి రాకుండా, జన్మలో మరో స్త్రీని కన్నెత్తి చూడకుండా చేసే ప్లానులో వుంది సీమా. తను కాకుండా మరో స్త్రీ అతని జీవితంలో వుండటానికి వీల్లేదు. అందుకే అతను కోలుకోలేని విధంగా పురుషత్వాన్ని దెబ్బ కొట్టాలనుకుంది సీమ. ఆవేశం అనర్థదాయకం.

కత్తిని వెనక దాచుకుని కోపాన్ని నిగ్రహించుకుని తలుపు తీసింది.

"హాయ్ డార్లింగ్" అంటూ లోనికొచ్చాడు రెహ్మాన్. అంతే కత్తితో అతడి కడుపు కింది భాగంలో కసిగా పొడిచింది సీమా. ఆ సమయంలో ఆమె కళ్ళు అగ్ని గోళాల్లా వున్నాయి. మనిషి ఆవేశంతో ఊగిపోతోంది.

చెయ్యెత్తు మనిషి, బలంగా వుంటాడు రెహ్మాన్. వెంటనే అలర్ట్ అయి పక్కకు దూకాడు. తొడలో దిగింది కత్తి. చివ్వున చిమ్మింది రక్తం. మరోసారి కత్తి ఎత్తింది సీమా. ఆమె చేతిని వడిసి పట్టుకున్నాడు రెహ్మాన్.

పెనుగులాటలో ఇద్దరికీ గాయాలయ్యాయి. రక్తం కార్పెట్ ను తడుపుతోంది.

వీళ్ళ అరుపులకు, గొడవకు పిల్లాడు అమన్ నిద్రలేచి చూసి బిత్తరపోయి ఏడుపు లంకించుకున్నాడు.

చలించలేదు సీమ. కత్తిని వదల్లేదు. ఆమెను తప్పించుకుని పరిగెత్తుకుంటూ బెడ్ రూమ్ లోకి వెళ్ళి తలుపు మూసుకున్నాడు రెహ్మాన్.

పళ్ళు కొరికింది సీమా. "బయటికి రారా నీ ప్రాణం తీస్తాను" అని అరుస్తూ కత్తి చేత పట్టుకుని తలుపు బయటే కూర్చుంది. పిల్లాడు అమన్ భయంతో వణికిపోతున్నాడు. ఆ దృశ్యం భయానకం. జీవితాంతం కలవరపరిచేది.

✻✻✻

లోపల రెహ్మాన్ గాయం నుండి రక్తం స్రవిస్తోంది. బట్ట చింపి కట్టు కట్టినా లాభం లేకపోయింది. వాడికీ భయమేసింది. తనను ప్రాణాధికంగా ప్రేమించే సీమ ఇంత పని చేస్తుందని అతడు ఊహించలేదు.

ఇక్కడ ఇది అక్కడ అది పడి వుంటారులే ఏలుకోవచ్చు అనుకున్నాడు. కానీ కథ అడ్డం తిరిగింది.

అతి ప్రేమ కళ్ళకు పొరలు కమ్ముకునేలా చేసి విచక్షణా జ్ఞానాన్ని నశింపజేస్తుంది.

✻✻✻

గదిలో బందీ అయినట్లుంది పరిస్థితి. రక్తం ఆగడంలేదు. శక్తి క్షీణిస్తోంది. వెంటనే డాక్టర్ కావాలి. బయటికి వెళ్తే సీమ చంపేస్తుంది. ఇలాగే లోపలే వుంటే చస్తాడు. ఆలోచించి ఇక గత్యంతరం లేక పోలీసులకు కాల్ చేసాడు రెహ్మాన్.

"ఏయ్ పోలీసులు వస్తున్నారు వుండు. నిన్ను జైలుకు పంపించకపోతే నా పేరు రెహ్మానే కాదు" అని కేకలేసాడు.

ఉలిక్కిపడింది. అలర్ట్ అయింది సీమా. బిడ్డ అమన్ ను దగ్గరికి తీసుకుంది.

పోలీసులకు ఏం చెప్పాలో బోధిస్తోంది. ఇంతలో కువైట్ పోలీసులు వచ్చి తలుపు కొట్టారు. కీ హోల్ నుండి పోలీసులను చూసిన సీమ ఆవేశం ఒక్కసారిగా చల్లబడిపోయింది. తను జైలుకు వెళ్తే పిల్లాడి పరిస్థితి ఏంటి? ఈ పరదేశంలో వాడికి దిక్కెవరు. అమన్ ముఖం చూసి బాధ కలిగింది. ఓ క్షణం తన కోపాన్ని, చర్యలను నిందించుకుంది. బయట పోలీసులు ఆగకుండా తలుపు కొడుతున్నారు.

"హా అజ్జీ.. బురఖా వేసుకుని తలుపు తీస్తా కాస్త ఆగండి" అంది.

ముస్లిం స్త్రీ సంప్రదాయం వారికి బాగా తెలుసు. పరాయి మగవాడి ఎదుటికి బురఖా లేకుండా స్త్రీ రాదు.

కాసేపు ఆగారు వాళ్ళు. చకచకా బురఖా వేసుకుని అమన్ కు చెప్పింది.

"నాన్నా పోలీసులు వచ్చారు. ఏ జరిగిందని నిన్ను అడుగుతారు. నువ్వు ఇందులో అమ్మ తప్పు ఏమీ లేదని నాన్నే గొడవ పడి అమ్మను కొట్టాడని చెప్పాలి. అలా చెప్పకపోతే పోలీసులు నన్ను తీసుకెళ్ళి పోతారు. తరువాత నీకు అమ్మ వుండదు" అని చెప్పింది.

"అలాగే అమ్మా.. నువు చెప్పినట్లే చెప్తాను" అన్నాడు అమన్.

ఆ తరువాతే తలుపు తీసింది సీమా.

పోలీసులు లోనికి వచ్చి బెడ్ రూమ్ తలుపు తీసి రెహ్మాన్ ను బయటికి తీసుకొచ్చారు. ఏం జరిగిందని ప్రశ్నించారు.

వీళ్ళిద్దరికంటే ముందే పిల్లాడు అమన్ నోరు తెరిచి చెప్పాల్సింది చెప్పేసాడు. అమ్మ చెప్పింది చెప్పినట్లే పోలీసులకు అప్పజెప్పాడు. తన కొడుకు అబద్ధం కూడా చెప్పగలడా అనుకుంటూ రెహ్మాన్ ఆశ్చర్యపోతూ చూసాడు అమన్ వైపు.

అవసరం అబద్ధాన్ని చెప్పిస్తుంది. అందులో అమ్మ అవసరం కదా అమన్ కు.

పోలీసులు మొదట అందరినీ హాస్పిటల్ కు తీసుకెళ్ళి గాయాలకు కట్లు కట్టించారు. తరువాత స్టేషన్ కు తీసుకెళ్ళారు. ఇద్దరి కథలు, వాదనలు విన్నారు.

పిల్లాడు చెప్పిన ప్రకారం సీమాది తప్పు లేదని తెలుస్తోంది. పిల్లలు అబద్ధాలు చెప్పరు కాబట్టి రెహ్మాన్ దే తప్పు అని

నమ్ముతూ రెహ్మాన్ ను అక్కడే వుంచి సీమాను అమీనును వెళ్ళి పొమ్మన్నారు .

ఆరేళ్ళ పిల్లాడు అమన్ తల్లికోసం అబద్ధం చెప్పాడు. అబద్ధం చెప్పకపోతే అమ్మకు కష్టం. చెపితే నాన్నకు నష్టం. నలిగిపోయాడు వాడు. తను అబద్ధం చెప్పేటప్పుడు నాన్న చూసిన చూపు గుర్తుకు వచ్చి వాడి చిన్ని హృదయాన్ని బాధపెడుతోంది. కానీ తండ్రి జోర్డాన్ వెళ్ళి వేరే పెళ్ళి చేసుకొని అమ్మను బాధపెట్టడం తప్పే కదా..

అయినా ఇప్పుడు తండ్రి జైల్లో వుండటం వాడికి నచ్చలేదు. రోజూ "నాన్న కావాలి మమ్మీ" అని ఏడుస్తున్నాడు. సీమా వాడిని సముదాయించలేక పోతోంది. దాదాపూ నెలరోజులు గడిచాయి. సీమకు కూడా ఒంటరితనం భయంకరంగా వుంది. భవిష్యత్తు భయాన్ని కలిగిస్తోంది. ఒకరోజు అమన్ పోరు భరించలేక జైలుకు వెళ్ళింది. అక్కడి ఆఫీసర్ ను పర్మిషన్ అడిగి రెహ్మాన్ ను కలిసింది. సీమాను చూడగానే ముఖం పక్కకు తిప్పుకున్నాడు రెహ్మాన్. మాట్లాడటానికి ఇష్టపడలేదు. అమన్ ను కూడా పలకరించలేదు.

"బాబా ఇంటికి ఎప్పుడొస్తావు" అని అడిగాడు అమన్.

"నువ్వే కదా నేను మీ అమ్మను కొట్టానని అబద్ధం చెప్పావు. ఇంక మీ దగ్గరికి రాను" అన్నాడు కోపంగా రెహ్మాన్.

బిక్క మొహం వేసాడు అమన్.

చూడగానే దగ్గరికి తీసుకుని హత్తుకుని, ముద్దు పెట్టుకునే తండ్రి ద్వేషంతో మాట్లాడటంతో తల్లడిల్లాడు అమన్. ఏడుస్తూ "నాన్నా మిస్ యూ" అంటూ చేతులు సాచి దగ్గరికి వెళ్ళాడు.

అయినా రెహ్మాన్ హృదయం కరగలేదు.  పురుగును చూసినట్లు చీదరించుకున్నాడు.

అమన్ హృదయం గాయపడింది. అయినా తండ్రిని వదిలి వెళ్ళడానికి వప్పుకోలేదు అమన్. ఇక్కడే వుంటా అని ఏడ్చాడు. వాడిని బలవంతంగా బయటికి తీసుకెళ్ళాల్సి వచ్చింది.

సీమాకు కూడా ఏడుపు వచ్చింది. కోపంలో పొరపాటు చేసానని బాధపడింది. క్షమాపణ కోరింది.  చేతులు కాలాక ఆకులు పట్టుకుని లాభం వుండదు. పరదేశాల్లో చాలావరకూ చేసుకునే పెళ్ళిళ్ళు తుమ్మితే వూడిపోయే ముక్కు లాంటివి. దేశాలు వేరయినప్పుడు సమస్య తీవ్రత ఎక్కువ.

అలా పరదేశంలో పుట్టిన పిల్లలు తల్లిదండ్రులు చెరో దిక్కుకు పోవడంతో అనాథలవుతున్నారు.

ఆర్నెల్ల తర్వాత జైలు నుండి ఇంటికి వచ్చి తన బట్టలు, సామాన్లు తీసుకుని ఫ్రెండ్ రూం కి వెళ్ళి పోయాడు రెహ్మాన్. సీమా "ఎక్కడికి వెళుతున్నావ్" అని అడిగింది.

"తల్లీ నీకొక నమస్కారం. నీ వల్ల నాకు ఉద్యోగం పోయింది. ఆర్నెల్లు జైల్లో వున్నాను. ఇక నీకూ నాకూ సరిపడదు. నీ వల్ల నాకు ప్రాణహాని వుంది. అందుకే నీకు దూరంగా వుండటం మంచిదని పోతున్నాను. తలాక్ తలాక్ తలాక్..

కువైట్ కోర్టుకు తీసుకెళ్ళి త్వరలో నీకు విడాకులు ఇస్తాను. చట్టప్రకారం కూడా నిన్ను వదిలించుకుంటాను అని చెప్పాడు రెహ్మాన్" అని చెప్పాడు రెహ్మాన్.

ప్రమాన్పడి నిర్లిప్తంగా చూస్తుండిపోయింది సీమా. అమన్ తండ్రి కాళ్ళను చుట్టుకుని ఏడ్చాడు. అయినా రెహ్మాన్ ఆగలేదు. అతడి హృదయం కరగలేదు.

నెలరోజుల్లోపే కోర్టుకు పిలిపించి సీమాకు, అమన్ కు జీవన భృతి కింద రెండు వేల దినార్లు చెల్లించి విడాకులు తీసుకున్నాడు రెహ్మాన్.

తరువాత రెహ్మాన్ మీద దిగులుతో సీమా కృంగిపోయింది. అనారోగ్యం కొని తెచ్చుకుంది. కువైట్ లో వుండి పని చేసే శక్తి ఆమెకు లేకపోవడంతో అమన్ ను తీసుకుని తన స్వదేశమైన శ్రీలంకకు వెళ్ళిపోయింది. దాదాపూ రెండేళ్ళు ప్రాణంతో పోరాడింది సీమా.

రెహ్మాన్ ను మరువలేక నరకయాతన అనుభవించింది. తరువాత అమన్ ను తల్లికి అప్పగించి ఈ లోకాన్ని విడిచింది. తల్లితండ్రి లేని అమన్ ను అమ్మమ్మ అతికష్టం మీద పెంచింది. పదో తరగతి వరకూ చదివించింది. ఆ తరువాత ఒకరోజు ఆమె కూడా కూతురు దగ్గరికే వెళ్ళిపోయింది.

అమన్ ఒంటరి వాడయ్యాడు. ఆరేళ్ళ వయసులో విడిచిపోయిన తండ్రి రెహ్మాన్ గుర్తుకొస్తూనే వున్నాడు. తన గమ్యం ఏంటో అపుడే నిర్ణయించుకున్నాడు అమన్. బంధువుల ఆదరణతో మరో రెండేళ్ళు శ్రద్ధగా చదువుకున్నాడు. ఇక ఆగలేదు. అతడి హృదయం కువైట్ వెళ్ళి తండ్రిని కలవాలని తొందర పడుతోంది. ఎందుకో తండ్రి క్షమిస్తాడనే నమ్మకం. పాస్పోర్టు చేయించి తెలిసిన వారందరికీ కాపీలు పంపి వీసా కావాలని అడిగాడు. అమన్ పరిస్థితి తెలిసి జాలిపడిన ఒక ఫ్రెండ్ వీసా ఇచ్చాడు. వెంటనే కువైట్ లో వాలిపోయాడు అమన్. తండ్రి ఎక్కడున్నాడో వెతికి పట్టుకుని ఎదురుగా నిలబడ్డాడు. అచ్చం తనలాగే వున్న అమన్ ను తొందరగానే గుర్తు పట్టాడు రెహ్మాన్. కాలం గాయాలు మాన్పుతుంది. కోపాన్ని మరిపిస్తుంది.

చేస్తున్న పనిని ఆపి దగ్గరికి వచ్చి అమన్ ను కౌగలించుకున్నాడు రెహ్మాన్. కన్నీళ్ళు పొంగి వచ్చాయి ఇద్దరికీ. ఎంతైనా తన రక్తం. తనకు ప్రతిరూపమైన కొడుకు మీద అనురాగం పెల్లుబికింది అతడికి.

అమన్ ను కువైట్ బ్యాంకులో ఉద్యోగంలో పెట్టాడు రెహ్మాన్. దాదాపూ పన్నెండేళ్ళ తరువాత తండ్రి కొడుకులు మరలా కువైట్ లో కలుసుకున్నారు. అమన్ తండ్రితో పాటూ జోర్డాన్ వెళతాడా? శ్రీలంక వెళతాడా లేక కువైట్ లోనే వుంటాడా అనేది కాలమే నిర్ణయించాలి.

ఆ మాటే మేము అడిగితే "నేను కెనడా వెళ్ళి సెటిల్ అవుతాను" అని నవ్వేసాడు అమన్.

పరదేశంలోని ప్రయాణంలో ఇలాంటి కథలెన్నో..

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments